


Digital, tmedia.net.in

# టీ-మీడియా

ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

సామాజికం.. ప్రజల పక్షం...

సంపుటి : 92
సంచిక : 214
పేజీలు : 3
శుక్రవారం, ఏప్రిల్ 17, 2026

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN



## ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో ప్రతిభా పురస్కారాలు

### - విద్యార్థులను సత్కరించిన ఇన్‌స్పెక్టర్ ఓ. మురళి

**టీ మీడియా, ఏప్రిల్ 16, ముదిగొండ :** ప్రస్తుత విద్యా ఫలితాల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన పోలీస్ సిబ్బంది పిల్లలను ముదిగొండ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ శ్రీ ఓ. మురళి ఘనంగా సత్కరించారు. స్టేషన్‌లో పని చేస్తున్న సిబ్బంది పిల్లలు చదువులో రాణించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, వారిని అభినందించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు: కానిస్టేబుల్ టీవీ కిషోర్ కుమారుడు సంతోష్ కుమార్, ఇంటర్మీడియట్ ఎంపీసీ విభాగంలో 1000 మార్కులకు గాను 992 మార్కులు సాధించి అత్యుత్తమ ఫలితాన్ని నమోదు చేశారు. హోంగార్డ్ బానోత్ కిషన్ కుమార్తె హారిక, ఇంటర్ ఎంపీసీలో 1000 మార్కులకు గాను 980 మార్కులు సాధించారు. హోంగార్డ్ ముల్లగిరి కాంతారావు కుమార్తె ప్రహర్షిని, సీబీఎస్ఈ పదవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను 515 మార్కులు సాధించి మెరిశారు. ఈ సందర్భంగా సీఐ మురళి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి,

మిగతా 3లో

# మక్క రైతు ఆగ్రహం





### -సొసైటీ సీఈఓని నిలదీసిన నాయకులు

**టీ మీడియా, ఏప్రిల్ 16 ,కొణిజర్ల:** కొణిజర్ల మండలంలోని మొక్కజొన్న కొనుగోళ్ల వ్యవహారం రైతులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తోంది. ఎకరానికి కేవలం 26 క్వింటాళ్లకే కొనుగోలు పరిమితం చేయడం, సొసైటీలు లారీలు పంపించాల్సి ఉన్నప్పటికీ ఆ బాధ్యతను కూడా రైతులపై మోపడం, పైగా ప్రతి లోడుకు, ప్రతి బస్తాకు అదనపు ఖర్చులు వసూలు కావడంతో రైతుల్లో ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.రైతుల ఆరోపణల ప్రకారం, సొసైటీ పేరుతో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు ఒక్కో టక్కు సెటికి లోడ్ ఎత్తిన రైతుల నుండి రూ.500 వరకు వసూలు చేస్తున్నారని, బస్తాలు కూడా సరఫరా చేయకుండా బయట నుంచి ఒక్కో బస్తా రూ.25 చొప్పున కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొన్నదని వాపోతున్నారు. కొన్నిచోట్ల బస్తా రూ.10 చొప్పున ఇస్తాం, సొంతంగా మాట్లాడుకోండి అంటూ రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడమే తప్ప, వాస్తవ సమస్యలకు పరిష్కారం లేకుండా పోయిందని రైతులు మండిపడుతున్నారు. మండల పరిధిలోని తనికెళ్ల రైతుల వరకు టక్కుపట్టి కొట్టొద్దు అనటంతో . విషయం తెలుసుకున్న బి కే ఎస్ నాయకులు బండారు సత్యనారాయణ సొసైటీకి చేరుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ కొంతసేపు సొసైటీ సీఈవో తో అలా పక్షపాతం చూపెట్టడం ఎందుకు కొట్టొద్దు అన్నారు అనే దానిపై వాగ్వాదానికి దిగడంతో. వారికి కూడా టక్కు పట్టి కొడతామని హామీ ఇవ్వడంతో సద్దుమణిగింది.రైతులు తమకు జరుగుతున్న పరిస్థితిపై వివరించారు. రైతులు బి కే ఎస్ నాయకులతో కలిసితో వారికి కలిగే అసౌకర్యాన్ని తెలిపారు.ప్రస్తుతం ఉన్న 26 క్వింటాళ్ల కొనుగోలు పరిమితి తమకు ఏమాత్రం సరిపోవడం లేదని, కనీసం 40 నుంచి 50 క్వింటాళ్ల వరకు పెంచితే కొంతమేర ఉపశమనం లభిస్తుందని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట పండించిన సమయంలోనూ, అమ్ముకునే సమయంలోనూ ఇంత ఇబ్బంది పడాల్సిన పరిస్థితి రావడం దారుణమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మొక్కజొన్న అమ్మకానికి వచ్చిన ప్రతి దశలోనూ రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, బస్తాలు, లోడింగ్, రవాణా, కొనుగోలు పరిమితి అన్నీ కలిసి రైతుల నడ్డివిరుస్తున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితి వల్ల ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థపై రైతుల విశ్వాసం సన్నగిల్లుతోందని, ఇది మరలా పునరావృతం కాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి.రైతు పక్షపాతమంటూ ప్రచారం చేసుకునే ప్రభుత్వమే వాస్తవంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోకపోవడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి కొనుగోలు పరిమితిని పెంచడం, అదనపు వసూళ్లపై కఠిన చర్యలు తీసుకోవడం, బస్తాలు మరియు లారీలు సమర్థవంతంగా అందించడం ద్వారా రైతులకు న్యాయం చేయాలని మండల రైతులు కోరుతున్నారు.ఇదే విషయంపై అధికారులు వెంటనే విచారణ జరిపి, కొణిజర్ల మండలంలో మొక్కజొన్న కొనుగోళ్లలో నెలకొన్న అక్రమాలు, అసౌకర్యాలపై స్పష్టమైన సమాధానం ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేకపోతే రైతుల ఆగ్రహం మరింత పెరిగే అవకాశం ఉందని స్థానికంగా చర్చ జరుగుతోంది.

# అభివృద్ధికి ప్రజాపాలన

### -జిల్లా కలెక్టర్. అనుదీప్




**టీ మీడియా ,ఏప్రిల్ 16 ,కూసుమంచి:** రాష్ట్రంలోని అన్ని మారుమూల గ్రామాలు, గిరిజన తండాలో అన్ని సౌకర్యాలతో అభివృద్ధి పరిచేందుకే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన ప్రగతి మండల కేంద్రంప్రణాళిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మండల కేంద్రం కూసుమంచి లోని విజయరామ ఫంక్షన్ హాల్ లో గురువారం మండల స్థాయి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సభ జరిగింది సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ 99 రోజుల బృహత్తర ప్రణాళిక ఆచరణతో గ్రామాల్లో ప్రాధాన్యత క్రమంగా నిధులు ఖర్చు చేస్తూ అభివృద్ధి పరుచుకునేందుకే ప్రభుత్వం పెండింగ్ నిధులను విడుదల చేసిందని చెప్పారు. గ్రామాల్లో వీధి దీపాల ఏర్పాటు శానిటేషన్ మల్టీపర్పస్ వర్కర్స్ వేతనాలు సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకున్నట్లు ఆయన చెప్పారు.జిల్లాలో 16 వేల 500 ఇండ్లు మంజూరి కాగా 28 వందల ఇండ్లు పూర్తి నిర్మాణం జరిగిందని మిగతా ఇండ్లు నిర్మాణ దశలో పూర్తికావస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం రైతులు పేదలు మహిళలు అభ్యున్నతి కోసం కృషి చేస్తూ ఉచిత విద్యుత్తు గ్యాస్ సన్న బియ్యం క్రొత్తరేషన్ కార్డుల మంజూరి వడ్డీ లేని రుణాలు 500 రూపాయల రైతు బోనస్ కల్యాణ లక్ష్మి పథకం అందజాతర వాటితో వేగవంత అమలు జరుగుతుందని కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో కూసుమంచి గ్రామ సర్పంచ్ కొండ కృష్ణవేణి మహిపాల్, పాలేరు నియోజకవర్గం ప్రత్యేక అధికారి రమేష్ కూసుమంచి ఇంచార్జి ఎం పి ఓ రాజారావు మండల తహసిల్దార్ సైదయ్య మండల వ్యవసాయ అధికారిని వాణి మండల వైద్యాధికారి సాయికుమార్ మండల పశు వైద్యాధికారి నీలకంఠం సి హెచ్ ఓ అపర్ణ తదితర అధికారులు పాల్గొన్నారు.

## జననేత జావీద్ భాయ్‌కు కన్నీటి వీడ్కోలు

**టీ మీడియా, ఏప్రిల్ 16, ఖమ్మం:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, ఖమ్మం నగర మాజీ అధ్యక్షుడు మహమ్మద్ జావీద్ మృతితో నగరంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన నివాసంలో ఉంచిన పార్థీవ దేహాన్ని గురువారం ఉదయం 8 గంటలకు సామాజికవేత్త అన్నం శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు షేక్ జానీ పాషా, టి. సంతోష్ చక్రవర్తి తదితరులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.జావీద్‌తో ఉన్న ఆత్మీయ అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ వారు భావోద్వేగానికి లోనయ్యారు. ఆయన జర్నలిస్టులందరినీ ఆప్యాయంగా పలకరించే స్వభావం ప్రత్యేకమని, అలాంటి మనసున్న నాయకుడు ఇక లేరనే విషయం తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరిని 'భాయ్' అంటూ స్నేహపూర్వకంగా పలకరించే జావీద్ భాయ్ ఇక లేరు అనేది అంగీకరించలేక పోతున్నాం' అని వారు విచారం వ్యక్తం చేశారు. ఆయనతో గడిపిన క్షణాలను గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు.పార్టీ అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నిస్వార్థ నాయకుడిగా ఆయనను స్మరించుకుంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



## తేజస్వి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించిన మాజీ ఎంపీ నామ



**టీ మీడియా, ఏప్రిల్ 16, ఖమ్మం:**పార్లమెంట్ వేదికగా బీజేపీ సభ్యుడు తేజస్వి సూర్య తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు పై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. 15వ లోక్‌సభలో తన పార్లమెంటరీ పార్టీ నేతగా ఉండి తెలంగాణ రాష్ట్ర సాధనకు తొలి ఓటు వేశానని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ ఏర్పాటుతో పోల్చడం నాలుగు కోట్ల ప్రజల మనోభావాలను తీవ్రంగా అవమానించడమేనని ఆయన అన్నారు. ఎంతోమంది అమరుల త్యాగాలు, ప్రజల దీక్షలు, దీర్ఘకాల ఉద్యమాల ఫలితంగానే తెలంగాణ ఏర్పడిందని స్పష్టం చేశారు. కే. చంద్రశేఖర్ రావు నాయకత్వంలో జరిగిన పోరాటంతో ఈ రాష్ట్రం సాధ్యమైందని తెలిపారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం పూర్తిగా చట్టబద్ధంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, దానిని తక్కువ చేసి చూపించేలా వ్యాఖ్యలు చేయడం తగదని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి రాష్ట్రానికి గౌరవం ఇవ్వాలని, ఇలాంటి వ్యాఖ్యలు దేశ ఐక్యతకు విఘాతం కలిగిస్తాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఎన్నికైన బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో ఉండి స్పందించకపోవడం అత్యంత విచారకరమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడే విషయంలో అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు ఒకే వేదికపై నిలబడాలని సూచించారు. ఇలాంటి బాధ్యతారాహిత్య వ్యాఖ్యలను వెంటనే ఉపసంహరించుకుని తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ గౌరవాన్ని కాపాడటంలో బీఆర్ఎస్ ఎప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమీక్ష

**టీ మీడియా ,ఏప్రిల్ 16, కొణిజర్ల:**మండల వ్యాప్తంగా జరుగుతున్న 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలులో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని లింగగూడెం రైతు వేదికలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అమలు తీరుపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామ స్థాయి నుండి మండల స్థాయి వరకు అమలవుతున్న కార్యక్రమాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకుని, పనితీరును మెరుగుపరచాల్సిన అంశాలపై సూచనలు చేశారు. ప్రత్యేకించి వ్యవసాయం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, విద్య, ఆరోగ్యం, మహిళా శిశు సంక్షేమం వంటి కీలక శాఖల పనితీరును సమీక్షిస్తూ, లక్ష్యాల సాధనలో వేగం పెంచాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు సమయానికి, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామాల్లో స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించటం తోపాటు అభివృద్ధి ప్రాధాన్యతలను గుర్తించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. గృహ జ్యోతి షాది ముబారక్ కళ్యాణ్ లక్ష్మి మహాలక్ష్మి తదితర పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకు వెళ్లాలన్నారు.ఇన్చార్జ్ ఎంపీడీవో ఉపేంద్రయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో తహసీల్దార్ అరుణ నేటిపారుదల శాఖ డీఈ గౌతమి శిల్ప మండల వ్యవసాయ అధికారి బాలాజీ ఎస్ఐ సూరజ్ ఐకెపి ఏపీఎం చిన వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీకి పన్ను బకాయి చెల్లించిన దేవాదాయ శాఖ

### మొదటి విడతగా రూ. లక్ష చెక్ అందజేత

**టీ మీడియా,ఏప్రిల్16,సింగరేణి(కారేపల్లి):**దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కారేపల్లిలో నిర్వహిస్తున్న సంతకు సంబంధించి కొనసాగుతున్న వివాదం సర్దుమణిగింది.పంచాయతీ పాలకవర్గం,దేవాదాయ శాఖ అధికారులు,గ్రామస్తుల సమక్షంలో జరిగిన చర్చలలో పన్ను బకాయి కింద రూ.2 లక్షలు చెల్లించాలని తీర్మానించారు.ఆ తీర్మానం మేరకు గురువారం దేవాదాయ శాఖ అధికారులు మొదటి విడతగా రూ.1 లక్ష చెక్‌ను ఆలయ ఇన్‌చార్జి మూడు మోహన్ చౌహాన్, సింగరేణి గ్రామపంచాయతీ సర్పంచ్ మేదరి వీరప్రతాప్ (టోనీ), కార్యదర్శి నెహ్రూ లకు అందజేశారు.దీంతో కొంతకాలంగా దేవాదాయ శాఖ, గ్రామపంచాయతీ మధ్య కొనసాగుతున్న వివాదానికి తెరపడినట్లైంది. స్థానికులు ఈ పరిష్కారాన్ని స్వాగతించారు.



# కొనుగోలు ఆలస్యం..

## మొక్కజొన్న రైతుల్లో ప్రభుత్వంపై పెరుగుతున్న అసంతృప్తి

### ప్రభుత్వంపై రైతుల గుస్సా

### హామీలు మాటలకేనా?..

### కేంద్రం ప్రారంభం కోసం రైతుల ఎదురు చూపులు





**టీ మీడియా,ఏప్రిల్16,సింగరేణి(కారేపల్లి):**ఖమ్మం జిల్లా సింగరేణి మండలంలో మొక్కజొన్న పంట కోతలు పూర్తయి రైతుల ఇళ్లకు చేరినా, సింగరేణి మండలం లో ఏర్పాటు చేస్తామన్న ఒకే ఒక్క కొనుగోలు కేంద్రాన్ని సకాలంలో ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటను అమ్ముకునే మార్గం లేక రైతులు ఆందోళన చెందుతుండగా, అధికారుల, ప్రజా ప్రతినిధులు నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.మొక్కజొన్నను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రకటించినప్పటికీ, ఆ ప్రకటనలు కేవలం మాటలకే పరిమితమయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండలంలో రైతుల సంఖ్య, పంట విస్తీర్ణాన్ని దృష్టిలో ఉంచుకుంటే కనీసం నాలుగు నుంచి ఐదు కొనుగోలు కేంద్రాలు అవసరమని, కానీ ఇప్పటివరకు అదనపు కేంద్రాల ఏర్పాటు పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని అంటున్నారు.
ఇప్పటికే ఏర్పాటు చేసిన ఒకే ఒక్క కేంద్రాన్ని కూడా ప్రారంభించడంలో జాప్యం జరుగుతుండటంతో రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి తక్కువ ధరలకు పంటను అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. రవాణా, హమాలి, నిల్వ ఖర్చులు పెరగడంతో రైతులపై అదనపు భారం పడుతోంది.ప్రజా ప్రభుత్వమని చెప్పుకుంటూ రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం వల్ల రైతుల్లో ప్రభుత్వంపై నమ్మకం క్రమంగా సడలిపోతోందని స్థానిక రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వెంటనే కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, అవసరమైన చోట మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం

### పేదలందరికీ సంక్షేమ పథకాలు

### ఇందిరమ్మ ఇళ్లకు 96% పురోగతి

### సమీక్షా సమావేశంలో స్పెషల్ ఆఫీసర్ చందన్‌కుమార్





**టీ మీడియా,ఏప్రిల్16, సింగరేణి(కారేపల్లి):** సింగరేణి మండలం లో 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికపై మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైఎస్ఎన్ గార్డెన్‌లో ఎంపీడీవో శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి మండల స్పెషల్ ఆఫీసర్, డీఎస్‌వో కే. చందన్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం 96 శాతం పురోగతిలో ఉందని తెలిపారు. అలాగే రైతు భరోసా కింద 14,079 మంది రైతులకు రూ.13.11 కోట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు.మండలంలో 6,816 మంది లబ్ధిదారులకు పింఛన్లు అందుతున్నాయని, అందులో 2,733 మంది వృద్ధులు, 2,692 మంది వితంతువులు, 1,008 మంది వికలాంగులు ఉన్నట్లు వివరించారు.గ్రామపంచాయతీలలో 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కింద నిర్దేశించిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా వచ్చే విద్యా సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు అల్పాహారంతో పాటు 21 రకాల వస్తువులతో కూడిన కిట్ అందజేయనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచేందుకు గ్రామ ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు.ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు, తాగునీరు, ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించి, శాఖల మధ్య సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎంపీవో మల్లెల రవీంద్ర ప్రసాద్, సూపర్డెంట్ మల్లెల రమేశ్, ఏవో బట్టు అశోక్ కుమార్, ఎంఈవో దుగ్గిరాల జయరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి, వైద్యాధికారి బీ. సురేష్, ఐకేపీ ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లు, స్థానిక సింగరేణి సర్పంచ్ మేదరి వీరప్రతాప్(టోనీ), సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

### డిఫెన్సివ్ డ్రైవింగ్‌తో ప్రమాదాలకు చెక్

### కారేపల్లిలో అరైవ్--అలైవ్ అవగాహన కార్యక్రమం




**టీ మీడియా,ఏప్రిల్16,సింగరేణి(కారేపల్లి):**రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, డిఫెన్సివ్ డ్రైవింగ్ అలవాటు చేసుకుంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని ఖమ్మం టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్‌కుమార్,కారేపల్లి ఎస్సై బైరు.గోపీలు అన్నారు.సింగరేణి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం అరైవ్--అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు డిఫెన్సివ్ డ్రైవింగ్ తారకమంత్రమని పేర్కొన్నారు. వాహనం నడిపేటప్పుడు పరిసరాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉండటం వల్ల ప్రమాదాలను నివారించవచ్చన్నారు.తెలంగాణ రాష్ట్రంలో ప్రతి ఏడాది రోడ్డు ప్రమాదాలతో అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటం బాధాకరమన్నారు.ప్రమాదాల నివారణ కోసం ప్రభుత్వం చేపట్టిన అరైవ్--అలైవ్ కార్యక్రమాన్ని గ్రామ స్థాయికి తీసుకెళ్తున్నట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.ముఖ్యంగా యువత సినిమాల్లో హీరోల్లా నిర్లక్ష్యంగా వాహనాలు నడపవద్దని సూచించారు.వాహనదారులు డ్రైవింగ్ సమయంలో తమ భార్య, పిల్లలు, తల్లిదండ్రులను గుర్తు చేసుకుంటే బాధ్యతతో నడుపుతారని తెలిపారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంతో పాటు ట్రాఫిక్ రూల్స్‌ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.



## మార్పు మీ గ్రామాల నుండే రావాలి

**-పోలీసు శాఖ నుండి పూర్తి సహకారం అందిస్తాం**

**-ముదిగొండ సిఐ వడ్డేపల్లి మురళి**

**టీ మీడియా, ఏప్రిల్ 16, ముదిగొండ :** మీ పిల్లల ప్రవర్తన, నడవడికలను గమనించాలని ముదిగొండ సీఐ వడ్డేపల్లి మురళీ అన్నారు. మండల కేంద్రమైన ముదిగొండ నవతేజ ఫంక్షన్ హాల్ లో గురువారం ఏర్పాటు చేసిన 99 రోజుల ప్రజాపాలన – ప్రగతి ప్రణాళికలు మండల స్థాయి సమావేశంలో భాగంగా సిఐ వడ్డేపల్లి మురళీ పాల్గొని మాట్లాడారు. గంజాయి సేవించటం వలన కలిగే నష్టాలు, హెల్మెట్ ధరించటం వలన కలిగే ఉపయోగాలపైన గ్రామస్థాయి నుండి అవగాహన కల్పిస్తే మార్పు మీ గ్రామాల నుండే మొదలవ్వాలని అందుకు అనుకూలంగా గ్రామస్థాయి నుండి సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ గ్రామంలో కానీ మీ పరిసర ప్రాంతాల్లో కానీ గంజాయిను విక్రయిస్తున్నట్లు ఏమాత్రం అనుమానం ఉన్న వెంటనే సమాచారం ఇవ్వాలని, ఏవరైనా గంజాయి సేవించినట్లు కనిపించిన కూడా సమాచారము అందించాలన్నారు. మీ గ్రామంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా ప్రతి ఇంటి నుండి హెల్మెంట్ లేని ప్రయాణం ప్రమాదకరమని ఖచ్చితంగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని కుటుంబ బాధ్యతగా ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిర్వర్తించాలని సిఐ కోరారు. మండల వ్యాప్తంగా రోడ్డు భద్రతలపై కూడా అవగాహన కలిపిస్తూ గంజాయి పైన, యాక్సిడెంట్ లో పైన ఎప్పటికప్పుడు ప్రజల్లో అవేర్నెస్ తీసుకొస్తున్నామని దానికి ప్రజలందరూ సహాయ సహకారాలు అందిస్తున్నందుకు వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు

## గడ్డం పెద్దబక్కయ్య కన్నుమూత

**టీ మీడియా,ఏప్రిల్16,సింగరేణి(కారేపల్లి):**కారేపల్లి మండలం ఉరిసికాయలపల్లికి చెందిన సీపీఐ(ఎం) సీనియర్ నాయకుడు గడ్డం పెద్దబక్కయ్య (68) గురువారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.పార్టీ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని నాయకులు స్మరించారు.పెద్దబక్కయ్య మృతితో పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోయిందని పేర్కొన్నారు.ఆయన మృతదేహానికి సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండెబోయిన నాగేశ్వరరావు, మండల కార్యదర్శి కే. నరేంద్ర, నాయకులు వజ్జా రామారావు, దాసరి మల్లయ్య, బానోత్ బన్సీలాల్, తేజావత్ చందర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## పథకాల అమలులో ప్రత్యేక దృష్టి పెట్టండి

**జిల్లా సీఈఓ నాగలక్ష్మి**

**టీ మీడియా, ఏప్రిల్ 16, చంద్రుగొండ**

ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జెడ్పీ సీఈఓ, జిల్లా విద్యాశాఖాధికారి నాగలక్ష్మి అన్నారు. చంద్రుగొండలోని రైతువేదికలో ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలన్నారు. సిపిఎం, టిడిపి, బీఆర్ఎస్ నాయకులు పి.వేణు, సత్యనారాయణ, వెంకట్ నారాయణ, శ్రావణ్ గృహజ్యోతి లాంటి అనేక పథకాలు అర్హులైన పేదలకు అందట్లేదని అధికారులు దృష్టి సారించట్లేదని సిఈఓ దృష్టికి తీసుకువచ్చారు. దామరచర్ల గ్రామంలో ప్రాథమిక పాఠశాల జాతీయ రహదారి పక్కన ఉండటంతో విద్యార్థులను పాఠశాలకు పంపించేందుకు తల్లిదండ్రులు భయపడ్తున్నారని ఉపసర్పంచ్ సంగొండి రాఘవులు సీఈఓ దృష్టికి తీసుకెళ్ళారు. గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని చెప్పడంతో స్పందించిన సీఈఓ దృష్టి సారిస్తామన్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మండల అధికారులకు ఆమె సూచించారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, ఎంపీడీఓ బయ్యారపు, తహసీల్దార్ జగదీశ్వర్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి వినయ్, పంచాయతీ రాజ్ శ్రీనివాస్, సిపిడిఓ సిలోమని, మండల విద్యాశాఖ అధికారి సూరయ్య, పశువైద్యాధికారి సంతోష్, మండల ప్రాథమిక వైద్యులు రాము, హౌసింగ్ ఏఈ వినయ్ , ఆర్డబ్ల్యూఎస్ సాయి కృష్ణ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, వార్డు సభ్యులు, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.

# భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు..

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**-దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి**

**టీ మీడియా, ఏప్రిల్ 16, కూసుమంచి:** ప్రజలకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి, భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.గురువారం కూసుమంచి మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ భూ భారతి పైలట్ పోర్టల్ ప్రాజెక్ట్ అమలు పై రెవెన్యూ, సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి భూ సమస్యలకు పరిష్కారం కోసం రెవెన్యూ, ల్యాండ్ సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు క్రిందకు తెస్తూ ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ ను ప్రభుత్వం పైలట్ ప్రాజెక్ట్ క్రింద ఖమ్మం జిల్లాలోని కూసుమంచి మండలంలో ప్రవేశపెట్టిందని అన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద భూములు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ లు అందించే దిశగా ఇంటిగ్రేటెడ్ భూ భారతి పోర్టల్ రూపొందించామని అన్నారు.రైతులు ఇంటి వద్ద నుంచి కూడా స్లాట్ బుకింగ్ చేసుకునేలా పోర్టల్ తయారు చేశామని, రైతులు లాగిన్ కాగానే భూమి వివరాలు కనిపిస్తాయని, ఎన్ని ఎకరాలకు సర్వే కావాలో కోరితే అందుకు సంబంధించిన ఫీజు చెల్లించిన తర్వాత గ్రామంలోని లైసెన్స్ సర్వేయర్ లాగిన్ కు వెళ్తాయని, రెండు రోజుల్లో ఆ రైతు భూమికి సరిహద్దు ఉన్న రైతులకు నోటీసులు జారీ చేసి ఏడు రోజుల లోపు సర్వే పూర్తి చేస్తారని, ఈ వివరాలను సర్వేయర్ సిస్టంలో నమోదు చేశాక దరఖాస్తుదారుడైన రైతు సర్వే మ్యాప్ నకు యూనిక్, భూధార్ నెంబర్లు కేటాయిస్తారని భూభారతి పోర్టల్ లో కూడా వివరాలు నిక్షిప్తమవుతాయని అన్నారు. సర్వే పూర్తయిన తర్వాత సర్వే మ్యాప్ జనరేట్ చేసి పోర్టల్ లో అప్లోడ్ చేస్తారని ఈ ప్రక్రియలు దరఖాస్తు రిజిస్ట్రేషన్ ప్రారంభమైనప్పటి నుంచి పూర్తి వరకు ప్రతి దశలో పౌరుల రిజిస్టర్ మొబైల్ నెంబర్ కు మెసేజ్ వస్తాయని తెలిపారు. పైలెట్ ప్రాజెక్టు క్రింద ముందుగా కూసుమంచి మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ అమలు చేస్తున్నట్లు తెలిపారు. భూ సంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని, భూ భారతి కింద ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కారించేందుకు అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో పాలేరు నియోజకవర్గ స్పెషల్ అధికారి రమేష్, కూసుమంచి మండల తహసీల్దారు సైదులు, కలెక్టరేట్ భూ భారతి సూపరింటెండెంట్ నాగేశ్వరరావు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# అట్రాసిటీ కేసుల పరిష్కారానికి తక్షణ చర్యలు

**- జిల్లా కలెక్టర్ అంకిత్.**

**టీ మీడియా, ఏప్రిల్ 16,భద్రాద్రి కొత్తగూడెం :**జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణను వేగవంతం చేసి బాధితులకు తక్షణ న్యాయం అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయం సమావేశం మందిరంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట తో కలిసి నిర్వహించిన జిల్లా స్థాయి విజిలెన్స్ డ మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 40 ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమగ్రంగా సమీక్షించినట్లు తెలిపారు. ప్రతి కేసులో దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసి, నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేయాలని, చార్జ్‌షీట్లు ఆలస్యం లేకుండా దాఖలు చేయాలని అధికారులకు సూచించారు. బాధితులకు చట్టపరమైన రక్షణతో పాటు ప్రభుత్వ పరంగా అందించే పరిహారం, పునరావాస సదుపాయాలు సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అట్రాసిటీ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోదని స్పష్టం చేసిన కలెక్టర్, సంబంధిత శాఖల మధ్య సమన్వయం పెంపొందించి కేసుల పరిష్కారంలో వేగం తీసుకురావాలని పేర్కొన్నారు. అలాగే బాధితుల గోప్యత, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు.గ్రామ, మండల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఎస్సీ, ఎస్టీ హక్కులపై ప్రజల్లో చైతన్యం పెంపొందించాలని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట మాట్లాడుతూ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల నిర్వహణలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి కేసును సున్నితంగా తీసుకుని బాధితులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ సమయానికి పూర్తి చేయాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిని శ్రీలత, జిల్లా అధికారులు, పోలీస్ శాఖ అధికారులు, కమిటీ మెంబర్లు సామ్యా నాయక్ లకావత్ వెంకటేశ్వర్లు, లక్ష్మీ రాంబాయి, కోలూరి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.



## ముదిగొండ పోలీస్ స్టేషన్‌లో

ఎస్సై జి. హరిత మరియు ఇతర సిబ్బందితో కలిసి వారికి శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.

**లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి:**

అనంతరం సీఐ మురళి మాట్లాడుతూ.. “కష్టపడి చదివి ప్రతిభ చాటిన ఈ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి. ఇదే పట్టుదలతో చదివి మంచి ఉద్యోగాలు సాధించి, సమాజంలో తమ తల్లిదండ్రులకు, ముదిగొండ పోలీస్ విభాగానికి మంచి పేరు తీసుకురావాలి” అని ఆశీర్వదించారు. సిబ్బంది సంక్షేమమే కాకుండా, వారి పిల్లల ఎదుగుదలను ప్రోత్సహించడం తమ బాధ్యతని ఆయన పేర్కొన్నారు.

# ఘోర రోడ్డు ప్రమాదం

**ముగ్గురు మృతి, పలువురికి గాయాలు**

**టీ మీడియా, ఏప్రిల్ 16, అశ్వారావుపేట**

పట్టణంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. స్థానిక కెమిలాయిడ్స్ పరిశ్రమకు చెందిన రోజువారీ కూలీలు అశ్వారావుపేట – జంగారెడ్డిగూడెం రోడ్డులోని నందమూరి నగర్ వద్ద గల గోదాం నుంచి హెర్బెక్స్‌కు చెందిన జిగురు బస్తాలను ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అశ్వారావుపేట – సత్తుపల్లి రోడ్డులోని రైతు వేదిక వద్ద, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నుంచి బియ్యం లోడుతో వస్తున్న లారీ అదుపుతప్పి ముందుగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టి, అనంతరం ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ను ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ఇంజిన్ రెండు ముక్కలై భారీగా పొగలు ఎగసి పడ్డాయి. ఈ ప్రమాదంలో మోడల్ కాలనీకి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ చిట్టూరి కృష్ణయ్య (చుక్కయ్య, 55), ఊట్లపల్లి గ్రామానికి చెందిన కొవ్వాసి నాగరాజు (40) అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన మడకం సంతోష్ (19) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. అలాగే సోయం రమేష్ తీవ్రంగా గాయపడి అపస్మారక స్థితిలో ఉన్నాడు. మడకం సోమరాజు, ఆటో, డ్రైవర్ గద్దెల వెంకట్రావు తలకు గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే లారీ డ్రైవర్ అక్కడి నుంచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న స్థానిక సీఐ పి. నాగరాజు, ఎస్ఐలు యయాతి రాజు, అఖిల సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. గాయపడిన వారిని అంబులెన్సు లో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మృతుడు కృష్ణయ్య కుమారుడు రంజిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కృష్ణయ్య కు ఒక్కడే కుమారుడు ఉండగా, నాగరాజుకు భార్యతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతదేహాలకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆస్పత్రి వద్ద మృతుల బంధువుల రోదనలు హృదయ విదారకంగా మారాయి.